నిలువురాళ్లను పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం

- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- మక్తల్ ఎమ్మెల్యే, పేట కలెక్టర్, ఎస్పీతో కలిసి నిలువురాళ్ల పరిశీలన
- గుర్మిట్కల్ ఎమ్మెల్యే శరణగౌడ చేతుల మీదగా నేరడగంలో అనాథశరణాలయం ప్రారంభం

ముడుమాల్‌లోని నీళ్లవురాళ్లను పరిశీస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

మాగనూరు (కృష్ణ), మార్చి 16: ముడుమాల్ ప్రాంతంలోని బృహత్ శిలా యుగ నిరువురాళ్ల కట్టడాలను పర్యాటక కేంద్రంగా మారుస్తామని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం మాగనూరు, కృష్ణ మండలాల్లోని పచ్చిమాద్రి సంస్థాన విరక్త మఠం, ముడుమాల్‌లోని ప్రాచుర్యం పొందిన బృహత్ శిలా యుగం నిలువురాళ్ల కట్టడాలను మక్తల్ ఎమ్మెల్యే వాకిటి, పేట కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేశ్‌గౌతమ్‌తో కలిసి సందర్శించారు. ముందుగా మాగనూరు మండలంలోని నేరడగం పచ్చిమాద్రి సంస్థాన విరక్తమఠం జాతర మహోత్సవ సందర్భంగా పంచమ్మ సిద్ధలింగ మహా స్వాములను దర్శించుకొని దాతల సహాయంతో ఏర్పాటు చేసిన అనాథశరణాలయాన్ని మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే వాకటి శ్రీహరి కర్ణాటకలోని గుర్మిట్కల్ ఎమ్మెల్యే కందుకూరు శరణగౌడ చేతుల మీదగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మఠం అభివృద్ధికి గుర్మిట్కల్ ఎమ్మెల్యే రూ.10లక్షల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే నేరడగం మఠంలో భోజన శాల ఏర్పాటుకు తెలంగాణ రాష్ట్ర పర్యాటకం అభివృద్ధికి భాగంగా రూ.50 లక్షలు మంజూరయ్యేలా చేస్తానని నేరడగం మఠం పీఠాధిపతికి మంత్రి హామీ ఇచ్చారు. మంత్రి మాట్లాడుతూ.. ముడుమాల్ నిలువురాళ్లకు యునెస్కో గుర్తింపు కోసం ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో చోటుదక్కడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమన్నారు. నిలువురాళ్లు సప్తర్ష మండలంతో ఖగోళ పరిజ్ఞానంతో వాతావరణ మార్పులను ఆనాడే తెలుసుకునే వారని కాలాలను గుర్తించడానికి ఆదిమానవులు నిలువురాళ్లను ఓ క్రమంలో ఏర్పాటు చేసినట్లు చారిత్రక పరిశోధకులు ఖగోళ శాస్త్రవేత్తలు మంత్రికి వివరించారు. నిలువురాళ్లకు యునెస్కో శాశ్వత గుర్తింపు లభిస్తే మాత్రం ప్రపంచ స్థాయిలో ప్రత్యేక స్థానం వీటికి దక్కుతుందన్నారు. ప్రపంచ పటంలో ముడుమాల్ పేరు నిలుస్తుందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి శాశ్వత గుర్తింపుకు తదుపరి కార్యచరణ ప్రణాళిక తదితర అంశాలపై త్వరలోనే ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహిస్తానని చెప్పారు. ఈ సైట్‌లో భూములు కోల్పోయిన వారికి పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డెక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ వేదకుమార్, ఖగోళ శాస్త్ర విభాగ ప్రొఫెసర్ రుక్మిణి, దోషియర్ ఆర్కిటెక్ నిపుణుడు సూర్యనారాయణ, హెరిటేజ్ విభాగ అసిస్టెంట్ డైరెక్టర్ నాగలక్ష్మి, రీసెర్చ్ స్కాలర్ డాక్టర్ ప్రవీణ్, ఆర్డీవో రామచంద్రనాయక్ డీఎస్పీ లింగయ్య, తీరా గ్లోబల్ ట్రస్ట్ నిర్వాహకులు సందీప్ మక్తల పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా గ్రామాలాభివృద్ధి

- పాలమూరు ఎంపీ డీకే అరుణ

సూరారంలో పనులు ప్రారంభిస్తున్న ఎంపీ డీకే అరుణ

బాలానగర్, మార్చి 16: పార్టీలకతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పిలుపునిచ్చారు. మండలంలోని సూరారంలో ఆదివారం వివిధ అభివృద్ధి పనులకు డీకే అరుణ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రూ.40లక్షలతో నిర్మించతల పెట్టిన సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన, రూ.2లక్షలతో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను నిలువునా మోసం చేసిందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో బాలానగర్ మండల నాయకులు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహావిష్కరణ

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), మార్చ్ 16: కౌకుంట్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చత్రపతి శివాజీ విగ్రహాన్ని ఎంపీ డీకే అరుణ ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అన్నపూర్ణ, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేశంలోనే వ్యవసాయానికి అత్యధిక బడ్జెట్

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

దేవరకద్రలో రైతులకు స్ప్రింక్లర్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జీఎమ్మార్

దేవరకద్ర, మార్చి 16: దేశంలోనే తెలంగాణలో వ్యవసాయానికి అత్యధిక బడ్జెట్ కేటాయించిన ప్రజాప్రభుత్వమని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం నియోజకవర్గ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద దేవరకద్ర, చిన్నచింతకుంట, భూత్పూర్, మూసాపేట, అడ్డాకుల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు ఎమ్మెల్యే స్ప్రింక్లర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో రైతులకు సబ్సిడీ పథకాన్ని తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. మండలంలోని కోయిల్ సాగర్ ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు సాగునీటిని విడుదల చేసే ముందు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఐడీబీ సమావేశంలో యాసంగిలో ప్రతిసారి మాదిరిగా పాత ఆయకట్టు వరకు మాత్రమే సాగునీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు రైతులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. రైతుల పంటలు ఎండి పోకుండా నిరంతరం రైతుల క్షేమం కోసం పాటుపడినట్లు తెలిపారు. యాసంగిలో రైతులకు ఇబ్బందులు కలుగరాదనే ఉద్దేశంతో జూరాల నుంచి ప్రత్యేకంగా మోటర్ల ద్వారా పర్ధీపూర్ రిజర్వాయర్ వరకు నీరు తీసురావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి వేణుగోపాల్, హార్టికల్చర్ అధికారి శ్వేత, మార్కెట్ చైర్మన్ కథలప్ప, అరవింద్‌కుమార్ రెడ్డి, అంజిల్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డితదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు

- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మిడ్జిల్, మార్చి 16: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే అనురుధ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని దోనూర్‌లో స్థానియక నాయకులతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో విడుతలవారీగా ప్రతి ఒక్కరికీ ఇల్లును మంజూరు చేస్తామన్నారు. గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తామన్నారు. ప్రతి గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైరపర్సన్ జ్యోతి, రబ్బానీ, అల్వాల్ రెడ్డి వెంకటయ్య, సాయిలు, గౌస్, బాబా, నర్సింహులు, శ్రీధర్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, రాజా రెడ్డి బంగారు, సత్యం గౌడ్‌ఉన్నారు.

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ప్రయాణం.. ప్రాణసంకటం

- గుంతలమయంగా గుండేడు రోడ్డు
- దారిపొడవునా మురుగునీటి ప్రవాహం

బాలానగర్, మార్చి 16: మండలంలోని గుండేడులోని ప్రధాన రహదారి గుంతలమయమై వాహనాల రాక పోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. సుమారు ఆరు నెలలుగా గ్రామంలోని మురుగునీటి కాల్వలోంచి మురుగు నీరంతా బీటీ రహదారిపై ప్రవహిస్తోంది. రహదారిపై బీటీ పోవడంతో గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కరంగా మారింది. మురుగు రహదారి పొడవునా ప్రవహిస్తూ దిగువన నివాసాల్లోకి వెళ్తోంది. దీంతో రహదారి పొడవునా దుర్గంధం వెదజల్లుతోంది. ఆరు నెలలుగా రహదారిపై పారుతున్న మురుగు నీటి విషయమై అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నా పట్టించుకున్న నాథుడు లేడని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీవో అనిల్‌కుమార్ రెడ్డితో సంప్రదించగా.. గుండేడులో రహదారిని పరిశీలిస్తామని, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానన్నారు.

గుంతల మయమైన గుండేడు బీటీ రహదారి

ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 16: డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యాపక, విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని క్రిస్టియన్‌పల్లి ఎంవీఎస్ డిగ్రీ, పీజీ కళాశాల కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రథమ, ద్వితీయ సంవత్సరం పొలిటికల్ సైన్స్ స్టూడెంట్స్, అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ జ్ఞాపకాలు మరోసారి మననం చేసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.పద్మావతి, స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ.. స్టడీ సెంటర్‌లో పీజీ పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు నేడు కౌన్సిలర్లుగా బాధ్యతలు నిర్వర్తిస్తూ వేలాదిమంది విద్యార్థులకు విద్యాబోధన చేయడం అభినందనీయమన్నారు. అనివార్య కారణాలతో ఉన్నత విద్యను అభ్యసించలేక మధ్యలోనే చదువును మానేసిన విద్యార్థులకు ఉన్నత విద్య చదవడానికి అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఒక వరమన్నారు. కార్యక్రమంలో పవన్‌కుమార్, మాలిక్‌పాషా, ఎల్లప్ప, కిరణ్మయి, కృష్ణవేణి, స్టడీ సెంటర్ సిబ్బంది రఘువర్ధన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ వీడ్కోలు సమ్మేళనంలో అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు

దివ్యాంగుల ప్రాతినిధ్యానికి

ప్రత్యేక చట్టం తీసుకురావాలి

సంతకాలు సేకరిస్తున్న దివ్యాంగులు

మాగనూరు, మార్చి 16: తెలంగాణలో స్థానిక సంస్థల్లో ఇద్దరు దివ్యాంగులను నామినేట్ చేయడానికి వీలుగా ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కాశప్ప, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. మార్చి ఒకటి నుంచి 31వరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న లక్ష సంతకాల సేకరణలో భాగంగా మాగనూరులో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. తెలంగాణలో నేషనల్ డిసబుల్ స్టడీస్ రిపోర్ట్ ప్రకారం 43.02 లక్షల మంది రాష్ట్ర జనాభాలో దివ్యాంగులు ఉన్నారని తెలిపారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ హామీ ప్రకారం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున జీపీ, మున్సిపల్ చట్టాలను సవరణ చేసి ఇద్దరు దివ్యాంగులను నామినేట్ చేసేందుకు అవకాశాలు కల్పించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ సంఘం కోశాధికారి రవి, కృష్ణ మండలాధ్యక్షుడు కృష్ణ, గ్రామ సభ్యులు వెంకటమ్మ, నరసమ్మ, నర్సింహులు, సలీం, నరేశ్ పాల్గొన్నారు..

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

దేవరకద్ర, మార్చి 16: మండల కేంద్రంలోని పట్టణ సమీపంలో వంతెన వద్ద ఓ గుర్తు తెలియని మృతదేహం లభించినట్లు ఎస్సై నాగన్న తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. వంతెన సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి(35) మృతదేహం ఉన్నట్లు సమీప పొలాల రైతులు తెలపడంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా.. భిక్షాటన చేసే వ్యక్తిగా కనిపిస్తున్నట్లు తెలిపారు. అతని ఎడమ ఛాతిపై అమ్మ అని పచ్చ బొట్టు ఉందని ఎవరైనా గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మూసాపేట(అడ్డాకుల), మార్చి 16: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి ఆదివారం మృతి చెందినట్లు అడ్డాకుల ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంధ్యాలకు చెందిన (మౌలానా)బాషా(32) అనే యువకుడు మోటర్ సైకిల్‌పై శుక్రవారం హైదరాబాద్‌కు వెళ్తూ మార్గమధ్యలో కందూరు వాగుపై వంతెనపై డివైడర్‌ను ఢీ కొట్టాడు. చికిత్స నిమిత్తం జిల్లా దవాఖానకు తరలించగా.. కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం అతనిని కర్నూల్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ విషయంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అట్టహాసంగా వాలీబాల్ టోర్నీ ప్రారంభం

నవాబ్‌పేట, మార్చి 16: మండలంలోని పల్లెగడ్డలో వాలీబాల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల ఓపెన్ టు ఆల్ టోర్నీ ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. రెండు ఉమ్మడి జిల్లాల నుంచి మొదటి రోజు 22జట్లు టోర్నీలో పాల్గొన్నాయి. గురుకుంట మాజీ సర్పంచ్ కరణం ప్రతాప్, పల్లెగడ్డ మాజీ సర్పంచ్ చెన్నమ్మ సత్యయ్య ముఖ్య అతిథులుగా హాజరై టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటాలని కోరారు. గెలుపోటములను సమానంగా భావించాలని సూచించారు. చిన్న గ్రామంలో పెద్ద టోర్నీ నిర్వహించడం అభినందనీయమని.. యువకులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో నాయకులు రాములు, శివ, అర్గనైజర్లు బాల్‌రాజ్, విజయ్‌కుమార్, శ్రీశైలం, శ్రీకాంత్, రాఘవేందర్, రెఫరీలు మల్లేశ్, ముస్తాఫా, రాము తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాయకులు

ప్రైవేట్ యూనివర్సిటీలో కాంట్రాక్టు కార్మికుడు మృతి

జడ్చర్లటౌన్, మార్చి16: మండలంలోని పోలేపల్లి సెజ్‌లోని ఎన్ఎంఐఎంఎస్ యూనివర్సిటీలో కాంట్రాక్టు కార్మికుడు శ్రీనివాస్(54) మృతిచెందాడు. జడ్చర్ల సీఐ కమలాకర్ కథనం ప్రకారం.. మండలంలోని లింగంపేటకు చెందిన శ్రీనివాస్ కొంతకాలంగా పోలేపల్లి సెజ్‌లోని యూనివర్సిటీలో కాంట్రాక్టుపై హౌస్‌కీపింగ్‌గా పనిచేస్తున్నాడు. రోజువారీగా ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు డ్యూటీకి వెళ్లాడు. ఈ క్రమంలో అతను ఆకస్మాత్తుగా పడిపోవడంతో వెంటనే యూనివర్సిటీ సిబ్బంది గుర్తించి జడ్చర్ల దవాఖానకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు దవాఖానకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి భార్య అలివేలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

యూనివర్సిటీలో పనిచేస్తున్న కార్మికుడు శ్రీనివాస్ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ యాదయ్య, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణీల్‌చందర్ తోపాటు బీఆర్ఎస్ నాయకులు సర్కారు దవాఖానకు చేరుకొని మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. యూనివర్సిటీ అధికారులతో మాట్లాడి మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందింపజేయించారు.

బాధితులను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పెట్రోల్ పోసి తగలపెట్టడం దుర్మార్గం

మహ్మదాబాద్, మార్చి 16: అనవాళ్లు లేకుండా కొట్టేసిన చెట్లపై పెట్రోల్ పోసి తగలబెట్టడం దుర్మార్గమైన చర్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, జిల్లా కమిటీ సభ్యుడు నర్సింహులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని జూలపల్లి అటవీ ప్రాంతాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు నీలగిరి చెట్లను నరికిన ప్రదేశాలను, వాటిని పెట్రోల్ పోసి తగలబెట్టిన అనవాళ్లను గుర్తించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన అటవీశాఖ అధికారులే అడవిని అమ్ముకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. సొంత లాభాల కోసం అడవిలో అనవాళ్లు లభించకుండా పెట్రోల్ పోసి అంటిపెట్టడం సరైంది కాదన్నారు. మేకలు చెట్లు మేశాయని వారిపై జరిమానా వేసిన అధికారులు తమ తోటి అధికారులు నీలగిరి దుంగలను అమ్ముకుంటుంటే ఉన్నతాధికారులు నేటికి కూడా స్పందించపోవడం వెనకాల ఏదో పెద్ద కారణం ఉందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే అక్రమాలకు పాల్పడిన అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు లక్ష్మయ్య, బాల్‌రెడ్డి, రాజు, అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

చెట్లు నరికిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

రాష్ట్ర సభ్యులుగా ఎన్నికైన పేట సభ్యులు

ఎస్ఎస్‌కే సమాజ్ రాష్ట్ర కమిటీలో పేటకు పెద్దపీట

నారాయణపేట టౌన్, మార్చి 16: సోమ వంశీయ క్షత్రీయ సమాజ్(ఎస్ఎస్‌కే) రాష్ట్ర కార్యవర్గం సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యవర్గంలో నారాయణపేటకు పెద్దపీట వేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నాగూరావు నామాజీ, సీఎంసీ సభ్యులుగా నందూనామాజీ, యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా కమలాపూర్ శ్రీనివాస్, రాష్ట్ర యువజన విభాగం సభ్యులుగా చందు, ఉమాకాంత్, సందీప్, శ్రీకాంత్, నారాయణ, వినోద్ ప్రమాణ స్వీకారం చేశారు.

అగ్రకుల రిజర్వేషన్లు అతిపెద్ద తప్పిదం.. బీసీలకు తీవ్ర నష్టం

- యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, మార్చి 16: అగ్రకుల రిజర్వేషన్లు అతిపెద్ద తప్పిదమని రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్ యాదవ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘం భవనంలో యాదవ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో అణగారిన, బలహీన, పీడితవర్గాలకు మాత్రమే సంఘాలు ఉండాలని అట్లాంటిది పాలక పక్షంలో ఉన్నటువంటి వ్యక్తులు కూడా సంఘాలు పెట్టుకొని వాళ్లకు అనుకూలమైన చట్టాలను రూపకల్పన చేసుకుంటున్నారని విమర్శించారు. తద్వారా బలహీనవర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వాపోయారు. జనాభాలో 15శాతం ఉన్న అగ్రకులాలు ఈడబ్ల్యూఎస్ పేరు మీదు 10శాతం రిజర్వేషన్లు తీసుకోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.బైకని బాలుయాదవ్ మాట్లాడుతూ.. యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో శిక్షణ తరగతులు నిర్వహించి యాదవ విద్యావంతులను సమాజానికి చేరువచేసే ప్రయత్నం చేస్తుందన్నారు. రానున్న 15రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ శిక్షణ కార్యక్రమాలు పూర్తిచేయనున్నట్లు తెలిపారు. అనంతరం యాదవుల చరిత్ర-సంస్కృతి-విద్యావంతుల పాత్రపై జుర్రు నారాయణయాదవ్, ధరణి-భూ భారతి-న్యాయ సమస్యలపై రవికుమార్ యాదవ్, యాదవ సమాజంలో మూఢనమ్మకాలు-బాల్యవివాహాల నిర్మూలనపై వెంకటేశ్వర్లయ్య, రాజ్యాంగం దాని ప్రాముఖ్యత-సమకాలీన రాజకీయాలు యాదవుల పాత్ర అనే అంశంపై చలకాని వెంకట్‌యాదవ్, కుల సంఘాలు-విద్య దాని ప్రాముఖ్యతపై పాక కుమారస్వామి, బాలు యాదవ్ విశదీకరించారు. కార్యక్రమంలో గొర్రెల మేకల పెంపకం దారుల సహకార సంఘం చైర్మన్ శాంతయ్య యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు యాదవ్, నాయకులు రమేశ్, బత్తులమల్లేశ్, మద్దిలేటి, భీమన్న, లక్ష్మీనారాయణ, వెంకటేశ్‌ములు, నాగరాజు, వెంకటేశ్, నర్సింహ, బుచ్చన్న, శివకుమార్, నర్సింహులు పాల్గొన్నారు.

సంఘీభావం తెలుపుతున్న యాదవ విద్యావంతుల వేదిక నాయకులు

అక్రమ బెట్టింగ్‌లను ప్రోత్సహిస్తే చర్యలు

- పాలమూరు ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, మార్చి 16: జిల్లాలో అక్రమంగా ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్స్‌ను ప్రోత్సహిస్తున్న వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ జానకి హెచ్చరించారు. ఇటీవల యువత, విద్యార్థులు తక్కువ సమయంలో అధిక డబ్బులు సంపాదించాలనే ఆకాంక్షతో బెట్టింగ్ యాప్స్‌లో పాల్గొనడం, అప్పులపాలై తీవ్ర ఒత్తిడికి గురవడం, చివరికి ప్రాణాలను కోల్పోతున్న ఘటనలు పెరుగుతున్నాయన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చన్న భ్రమలో యువత, విద్యార్థులు ఈ బెట్టింగ్ యాప్స్ బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ఇదివారి జీవితాలను నాశనం చేసే ప్రమాదం ఉందని తెలిపారు. అక్రమ యాప్స్‌లో డబ్బులు పెట్టి మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గేమింగ్ యాప్స్‌తో ప్రమాదకర ఫేక్ లింక్స్ ద్వారా వ్యక్తిగత అకౌంట్ వివరాలు లీకయ్యే ప్రమాదం ఉందని, ఈ బెట్టింగ్ యాప్స్ వాడకాన్ని పూర్తిగా మానుకోవాలని తెలిపారు. మీ చుట్టూ ఇటువంటి కార్యకలాపాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులు, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

విద్యార్థులకు ప్యాడ్ల పంపిణీ

టంకరలో ప్యాడ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హన్వాడ, మార్చి 16: మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ జన్మదినం సందర్భంగా హన్వాడలో ఆదివారం కేక్‌కట్ చేసి ఒక్కరికొక్కరు పంచుకున్నారు. టంకరలో పదో తరగతి విద్యార్థులకు బీఆర్ఎస్ మాజీ వార్డు మెంబర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపరాదు

నారాయణపేట, మార్చి 16: మద్యం తాగి వాహనాలు నడపరాదని ఏఎస్సై అంజిలయ్య సూచించారు. ఆదివారం సాయంత్రం పోలీసులు పట్టణంలో వాహనాల తనిఖీ చేశారు. పలు వాహనదారులకు బ్రీత్ అనలైజర్‌తో డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీ చేసి 5 కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురవుతారని, తనిఖీలో పట్టుబడితే జరిమానాతోపాటు జైలు శిక్ష విధించనున్నట్లు పేర్కొన్నారు. మద్యం తాగిన కేసులు పునరావృతమైతే వాహనాన్ని సీజ్ చేయడం తోపాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

పంటలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

హన్వాడ; మార్చి 16: కరెంట్ సక్రమంగా, నీరు లేక పంటలు ఎండుతున్న రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు అన్నారు. ఆదివారం మండలంలోని మాదారం, ముని మోక్షు, తిరుమల గిరి, యారోనిపల్లి తోపాటు వివిధ గ్రామాల్లో ఎండిన వరి పంటలను సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటలు ఎండిపోతుంటే ఒక్క ఎమ్మెల్యే గానీ, మంత్రి రైతులను పరమర్శించడంలేదన్నారు. మండలంలో వేలాది ఎకరాల్లో పంటలు ఎండి పోయి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, ప్రభుత్వం వెంటనే వారికి నష్టపరిహారం అందించాలని లేదంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య, రాములు, రేఖమయ్య, శేకర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పొట